www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 9 జనవరి 2023

5

తిరుపతి

ప్రశాంత వాతావరణంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ ప్రశాంత వాతావరణంలో జరిగిందని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి తెలిపారు. తిరుపతి కేంద్రంగా 14 పరీక్షా కేంద్రాలలో రెండు సెషన్స్‌లో జరిగిన ఈ పరీక్షలకు 7915 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా ఉదయం సెషన్‌లో 5522 మంది 69.77శాతం మధ్యాహ్నం సెషన్‌లో 5510 మంది 69.61శాతంగా అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో తమ వంతు బాధ్యతగా పరీక్షల కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, కస్టోడియన్‌గా వ్యవహరించిన ఆర్డీఓ కనక నరసారెడ్డి, లైజన్ అధికారులుగా విధులు నిర్వహించిన జిల్లా అధికారులను, ఏపీపీఎస్సీ అధికారులను, పోలీస్‌శాఖని, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

ప్రభుత్వ భూముల్లో దేగల కళ్లు..!

- రాత్రికి రాత్రే అక్రమంగా దున్నకాలు
- విచ్చలవిడిగా ఆక్రమణలు.. విక్రయాలు
- అధికార యంత్రాంగంపై అక్రమార్కుల ఒత్తిడి

ఆక్రమణకు గురైన స్థలం

ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు దేగళ్లా వాలిపోతున్నారు.. రాత్రికి రాత్రే అక్రమంగా దున్నేస్తున్నారు. తామెవరికీ భయపడమంటూ ఆక్రమించుకుంటూ వెళ్తున్నారు. వెంటనే ప్రభుత్వ భూముల్లోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారు. భూములకు సంబంధించి పత్రాలు సైతం మార్చి దర్జాగా విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములను రూ.కోట్లలో విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డొచ్చిన అధికారులను ఎంజాయ్‌మెంట్ సర్టిఫికేట్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తుండటం గమనార్హం.

ప్రజాశక్తి-ఓజిలి

ఓజిలి మండలంలోని మాచవరం పంచాయతీ వీర్లగునపాడు గ్రామానికి వెళ్లే రహదారికి అతి సమీపంలో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. పంచాయతీలోని సర్వేనంబర్లు 1, 9, 10లలో సుమారు 50 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములను తమ వశం చేసుకోవడానికి మాచవరం, ముమ్మాయిపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు నాయకులు పక్కా ప్రణాళిక రూపొందించి తిరుమలపూడి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులతో తహశీల్దార్ కార్యాలయానికి అర్జీలు పెట్టించి, వారి వద్ద నుంచి కొంత నగదును తీసుకున్నట్లు సమాచారం. గత రెండు రోజుల క్రితం వరకు బీడు భూములుగా ఉన్న ఈ భూముల్లో రాత్రికి రాత్రే దున్నేసి ఆ భూములకు సాగు చేస్తున్నట్లు ఎంజాయ్‌మెంట్ స్కెచ్ ఇవ్వాలని ఆ నాయకులు తాహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ఈ నాయకులపై పలు ఆరోపణలు ఉన్నాయి. నకిలీ పాసుపుస్తకాలు సష్టించి మూడో కంటికి తెలియకుండా విక్రయాలు చేసినట్లు.. బ్యాంకుల్లో సైతం రుణాలు పొందినట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి. బీడుగా ఉన్న ప్రభుత్వ భూములకు సర్వేయర్, వీఆర్వో ఎంజాయ్‌మెంట్ స్కెచ్ ఎలా ఇస్తారని మాచవరం గ్రామస్థులు రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులను ముప్పు తిప్పలు పెట్టి తమ పనులు చేసుకోవడంలో ఈ నాయకులు దిట్టలు. అధికారులు ఏమైనా ఫర్వాలేదు తమ పనులు మాత్రం చేసి పెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించకపోతే తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని మాచవరం గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములను అనుమతులు లేకుండా దున్నితే చర్యలు తీసుకుంటాం. మండలంలోని మాచవరం పంచాయతీ పరిధిలో కొంతమంది ప్రభుత్వ బీడు భూములను దున్నుతున్నారని మా దష్టికి వచ్చింది. వారికి ఎటువంటి పట్టాలు మంజూరు చేయడం జరగదు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

- డి.లాజరస్, తహశీల్దారు

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

సీజనల్ వ్యాధులపై అవగాహన

చిత్తూరు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్

ఇంటర్వ్యూ

మున్సిపల్ హెల్త్ ఆఫీజసర్ డాక్టర్ లోకేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు నగరంలో ప్రధానంగా పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతోంది. పర్మినెంట్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు నగర పాలక సంస్థలో 300 మందికి పైగా ఉన్నారు. డివిజన్ల వారీగా విధులు కేటాయించడం జరిగింది. సచివాలయ సిబ్బంది కంట్రోల్‌లో ఆయా డివిజన్లల పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఇంటింటా చెత్త సేకరించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. క్రమం తప్పకుండా చెత్త సేకరణ చేపడుతున్నాం. అలాగే రోడ్లుపై పరిశుభ్రంగా ఉంచడంతో పాలు ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలిచేలా ఉన్న ప్రాంతాలను గుర్తించి పూడ్చివేయడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. నగరాన్ని సర్వాగం సుదరంగా తయారు చేసేలా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నాం. కట్టమంచి, గంగినేని చెరువు పార్కును అభివృద్ధి చేస్తున్నాం, ఇటీవల గంగినేని చెరువులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగింది. గంగినేని చెరువు వద్ద వాకర్స్ కోసం సదుపాయాలు కల్పిస్తున్నాం.

ప్రజాశక్తి : వారం రోజులు పారిశుధ్య డ్రైవ్ ఎలా జరుగుతోంది...?

ఎంహెచ్ఓ: ఈనెల 5వ తేది నుంచి చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని 50డివిజన్లలో సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపటడం జరుగుతోంది. డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయడం, ప్రధానంగా నివాసాల మధ్య ఖాళీ ప్రాంతాల్లో నిల్వ నీటిని తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్రజాశక్తి: దోమల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంహెచ్ఓ: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, మురుగు నీరునిల్వ వంటి ప్రాంతాల్లో దోమల వృద్ధి అధికంగా ఉంటోంది. దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాల ద్వారా పగటిపూట చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. దోమల వృద్ధిని అరికట్టేలా లార్వాల నియంత్రణకు ఆయిల్ బాల్స్ క్రమం తప్పకుండా వేయడం, ప్రతిఇంటి వద్ద ఫాగింగ్, మురుగునీటి కాలువల్లో స్ప్రేయింగ్ చేపటడంతో పాటు హోటళ్ళు, ఫాస్‌పుడ్ సెంటర్లకు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నాం. శుభ్రత పాటించాలని సూచనలు చేయడం జరుగుతోంది. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని, అవసరమైతే నోటీసులు జారీ చేస్తున్నాం.

ప్రజాశక్తి : పారిశుధ్య పనుల్లో వార్డువాలంటీర్ల పాత్ర ఏమిటి?

ఎంహెచ్ఓ: ప్రతిడివిజన్‌లో వార్డు వాలంటీర్‌కు పారిశుధ్య పనులకు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇంటింటా చెత్తసేకరణ ఎలా జరుగుతోందో పరిశీలించాలి. చెత్త సేకరణపై వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి. తన పరిధిలోని చెత్తసేకరణ పన్ను వసూలు చేయాలి. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి. పారిశుధ్య కార్మికులను సమన్వయం చేసుకుంటూ డివిజన్ పరిధిలో ఏ ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేది శ్యానటరీ మేస్త్రీలకు ఆదేశాలు ఇస్తూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. అలాగే తన పరిధిలో ఎవ్వరికైనా అంటువ్యాధులు సోకితే వెంటనే సమాచారం ఇవ్వాలి.

ప్రజాశక్తి : చెత్తసేకరణ పన్ను చెల్లింపు ఎలా ఉంది?

ఎంహెచ్ఓ: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయించిన ధర ప్రకారం చెత్తసేకరణ పన్ను వసూలు చేస్తున్నాం. హోటళ్ళు, కళ్యాణ మండపాలు, షాపింగ్‌మాల్స్ రూ.100 నుంచి 150ల మధ్య తరగతి నివాసం ఉండే ప్రాంతాల్లో నెలకు రూ.70 మురికివాడల్లో రూ.30 వసులు చేయడం జరుగుతోంది. స్వచ్ఛదంగా చెత్తపన్ను వసూలు చేస్తున్నాం.

ప్రజాశక్తి: నగరాభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంహెచ్ఓ: నగర అభివృద్ధిలో భాగంగా గ్రీనరీని పెంచేందుకు మొక్కలు నాటే కార్యక్రమం చేపడతున్నాం. గాంధీ సర్కల్‌ను మరింత సుందరంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోంది. పార్కుల అభివృద్ధి, సిబ్బందిని నియమించడం జరుగుతోంది. వర్మీ కంపోస్టు యార్డులో వ్యర్థాలతో ఎరువుల తయారీ, కూరగాయల పెంపకం చేపడుతున్నాం. డ్రైనేజీ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది. నిధులు మంజురైన తరువాత పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం

నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఐక్యత చాటుతున్న రెడ్డి సంఘం నేతలు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్‌లోని రెడ్ల సంక్షేమం కోసం కృషి చేస్తానని నూతన రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన అన్నమయ్య జిల్లాకు చెందిన కసిరెడ్డి వెంకట శివారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి- కరకంబాడి మార్గంలోని రెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నూతన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా రామకష్ణారెడ్డి, కోశాధికారిగా ఎం.సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులుగా సాంబశివారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, అధికార ప్రతినిధిగా బాల్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా వెంకట్ రెడ్డి, శశికాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్ రెడ్డి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈసందర్భంగా వెంకటసుబ్బారెడ్డి, నరేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్లసంక్షేమం కోసం అందరిని కలుపుకొని నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రజాకవి మహాయోగి వేమన జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు కతజ్ఞతలు తెలిపారు. రెడ్డికార్పొరేషన్ ద్వారా నిరెడ్డి నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని, రెడ్డి భవనాల నిర్మాణానికి భూములు కేటాయించాలని, స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విశ్వకవి శ్రీ మహాయోగి వేమన విగ్రహాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో తిరుపతి అధ్యక్షులు తిరుమలరెడ్డి, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకష్ణారెడ్డి, నారద వరదారెడ్డి, మహేందర్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అద్దె గదుల ధరలు తగ్గించాలి

టిడిపి ధర్నా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: టీటీడీ పెంచిన అత్యధికలను వెంటనే తగ్గించాలని కోరుతూ ఆదివారం టీటీడీ రెండవ సత్రం వద్ద ఇదేమి కర్మ అంటూ ధర్నా కార్యక్రమం చేశారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మన్నూరు సుగుణమ్మ మాట్లాడుతూ 'ఇదేం ఖర్మ మన తిరుమలకు' తిరుమలలో గదుల ధరలను భారీస్థాయిలో పెంచడం అత్యంత దారుణం అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరుపతి చేరుకున్న భక్తులను నిలువ దోపిడి చేయడంలో బాగా సమర్ధవంతంగా పనిచేస్తుందన్నారు. దేవుడి దర్శనం దగ్గర నుంచి భక్తుల వసతి వరకు ఏదీ వదిలే పరిస్థితి లేదన్నారు. దేవుడికి భక్తితో తలనీలాలు సమర్పించుకోవాలకునే భక్తులకు జగన్ ప్రభుత్వం అరగుండు కొట్టి, అడ్డదిడ్డంగా దోచుకునే కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. గత మూడేళ్లలో ఈ ప్రభుద్దులు ఇచ్చిన జీవోలు ఏది చాసినా తుగ్లక్ ఫారుమలను మాత్రమే తలపిస్తున్నాయని ఆరోపించారు. తమ కష్టాలను దేవుడితో కూడా చెప్పుకునే పరిస్థితి లేని దౌర్భాగ్యపు స్థితి దాపురించింది మన రాష్ట్ర ప్రజలకని విమర్శించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, తిరుపతి కార్పొరేటర్, ఆర్‌సి మునికష్ణ, టిడిపి నగరాధ్యక్ష కార్యదర్శులు చిన్నబాబు, మహేష్ యాదవ్, తిరుపతి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు ఊకా విజయ్‌కుమార్, కష్ణయాదవ్, మునిశేఖర్ కుమార్ పాల్గొన్నారు.

జనవరి 12 నుంచి ఎస్‌ఎస్‌డి టోకెన్లు జారీ

ప్రజాశక్తి- తిరుమల: జనవరి 2 నుండి 11వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం కోసం ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ కోటా ఆదివారంతో ముగిసింది. జనవరి 12వ తేదీ నుండి ఏరోజుకారోజు దర్శనం కోసం తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో మునుపటిలాగానే ఎస్ఎస్‌డి టోకెన్లు జారీ చేయబడతాయని టిటిడి కోరుతుంది.

విద్యుత్ బస్సులో ప్రయాణించిన కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ముఖ్యమంత్రి గత సంవత్సరం సెప్టెంబర్ 7న శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ బస్సులను ప్రారంభించారని నేడు కుటుంబ సభ్యులతో కలిసి కాలినడకన వెళ్లి తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుమల నుంచి తిరుపతి వరకు విద్యుత్ బస్సులో ప్రయాణించామని సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అన్నారు. జిల్లాలో దాదాపు 100 బస్సులు కేటాయింపు జరిగిందని ఇందులో 50 బస్సుల వరకు కేవలం తిరుపతి - తిరుమల, మరో 14 రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమల యాత్రికుల కోసం ఏర్పాటు చేస్తున్నారని తిరుపతి నుండి మదనపల్లి కడప నెల్లూరు ప్రాంతాలకు మరో 12 విద్యుత్ బస్సులు వంతున నడపనున్నామని అన్నారు. నేడు విద్యుత్తు బస్సులో ప్రయాణికులను పలకరించగా కారు కన్నా సుఖవంతమైన ప్రయాణం ఇందులో ఉందని అభిప్రాయాలు వ్యక్తం చేశారని అన్నారు. విద్యుత్ బస్సుల నిర్వహణ కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయింపు చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరంగా కాలుష్యం తగ్గడంతోపాటు సుఖవంతమైన ప్రయాణం ఈ విద్యుత్ బస్సులలో ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యుల ప్రయాణ సమయంలో జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి, సిటిఎం భాస్కర్‌రెడ్డి, బస్సుల నిర్వహణ సిబ్బంది వీరబాబు, మహేష్, డ్రైవర్ మురళిలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

తిరుమలకు విద్యుత్ బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరిలో సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో ఆశ కార్యకర్తలు, మున్సిపాల్టీ కార్మికులు ఫ్రంట్‌లైన్ వారియర్‌గా ఉంటూ కరోనాను తరిమికొట్టడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి శ్రమను గుర్తించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మారుస్తూ కార్మికులకు తీరని అన్యాయ చేస్తోందని తెలిపారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ రంగానికి దోచిపెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల మధ్య వైశ్యమాలను రెచ్చగొడుతుందని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం స్కీం వర్కర్లకు కనీసం వేతనం అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. జీవో నెంబర్ ఒకటి పేరుతో ప్రజా ఉద్యమాల్ని అనగదొక్కాలని చూస్తుందని ఇదే పరిస్థితి కొనసాగితే కార్మికవర్గం నుంచి తీవ్రప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు. భవిష్యత్ పోరాటాలకు కార్మికులకు సిద్ధం కావాలని సిఐటియూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం సిఐటియూ జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు మస్తానయ్య, ఉదయ్ కుమార్, ప్రజాఉద్యమాలను తీవ్రతను చేస్తామని తెలిపారు. అంగన్వాడీ నాయకురాలు స్వరూపరాణి, మంజులమ్మ, కార్తీక్, చెంచు కష్ణయ్య, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందమ్మ కాలనీలో శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్, ఎంజీఎం హాస్పిటల్స్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయమంతమైంది. బందమ్మ కాలనీ వాసుల నుంచి అపూర్వ స్పందన లభించింది. మొత్తంగా వందమందికి పైగా కాలనీ వాసులు శిబిరానికి విచ్చేసి వైద్య పరీక్షలు చేసుకున్నారు. గుండె, ఎముకలు, చిన్నపిల్లలు, సాధారణ వ్యాధుల సంబధిత విభాగ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ కింద రెఫర్ చేశారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి, ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ముఖ్యఅతిథులుగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీకాళహస్తితో పాటు తూర్పు మండలాల ప్రజలకు మెరుగైన ఉన్నత వైద్యం అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ఎంజీఎం హాస్పిటల్స్‌ను స్థాపించినట్లు మయూర్ తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజల సైతం ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్న లక్ష్యంతో గ్రామాల్లో, మురికి వాడల్లో విరివిగా వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ సహకారంతో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ప్రెస్‌క్లబ్ చేపట్టబోయే సామాజిక సేవా కార్యక్రమాలకు ఎంజీఎం తరపున సంపూర్ణ సహాయ సహకారాలందిస్తామని హామీ ఇచ్చారు. ఈ వైద్య శిబిరంలో ఎంజీఎం వైద్యులు వివేక్, తేజస్విని, దినేష్, అభిషేక్, పాత్రికేయులు ఎంవి.రమణ, ఈశ్వరయ్య, వీసీ వెంకటయ్య, నెల్లూరు శీను, వి.రవి, మల్లెంబాకం మునికష్ణారెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కామేష్, మెహర్, చంద్రశేఖర్, బాలు, వెంకటేష్, యాసిన్, చాన్ బేగం, బాలచంద్ర, ఎంఎం శ్రీను, పేట లోకేష్, శివ, ఎంజీఎం సిబ్బంది మధు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై నిఘా దారుణం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం తమ సొంత ఉద్యోగులపై ఫ్లయింగ్ స్క్వాడ్ పేరుతో 'నిఘా'ను ఏర్పాటు చేయటం, అడుగడుగునా ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నించడం దారుణమని తక్షణం ఈ నిర్బంధ విధానాలను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆదివారం నాడు ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను దొంగల కంటే హీనంగా చూస్తూ అవినీతిపరులుగాను, అక్రమార్జన పరులుగాను చిత్రీకరించడానికి, ప్రజల ముందు నేరస్తులుగా నిలబెట్టడానికి స్వయంగా ప్రభుత్వమే ఉద్యోగులను 'బలి' చేయాలన్న తీరుగా ప్రవర్తించడం అన్యాయమని విమర్శించారు. తమ హక్కులు కాపాడమని అడిగిన నేరానికే రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టుకుని ఉద్యోగుల పట్ల వేధింపులకు పాల్పడుతుందని ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. పిఆర్సి అమలు విషయంలో, వేతనాల పెంపుదల విషయంలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ పోరాడుతున్న ఉద్యోగులు, కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఉద్యోగుల్లో తీవ్రమైన వ్యతిరేకతను తెచ్చిపెట్టిందని అన్నారు. ఉపాధ్యాయుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రోజుకో పద్ధతి పెట్టి వేధింపులకు పూనుకుంటున్నారని, తాజాగా ఫ్లయింగ్ స్క్వాడ్ పేరు పెట్టి ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారని, చిత్తూరు జిల్లాను ప్రయోగాత్మక జిల్లాగా ఆరంభించారని దీనిని సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నదని కందారపు మురళి అన్నారు. ప్రభుత్వం రోజుకో చీకటి జిఓ లను, నిర్బంధ జిఓలను తెస్తూ ప్రజలను, ఉద్యోగులను, ఉపాధ్యాయులను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నదని జీఓ నెంబర్-1 పేరుతో ర్యాలీలు, సభలను నిషేధిస్తూ తెచ్చిన జీఓ నిర్బంధానికి పరాకాష్టగా పేర్కొన్నారు. తక్షణం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తన తప్పుడు విధానాలను ఉపసంహరించుకొని ప్రజల పట్ల, ప్రజాఉద్యమాల పట్ల, ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

పవన్‌ను విమరిస్తే ఊరుకోం..

తిరుపతి గాంధీ విగ్రహం వద్ద జనసేన నిరసన

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై వైసిపి మంత్రులు గుడివాడ అమర్నాథ్, అంబటి రాంబాబు, రోజా ఆదివారం హైదరాబాదులో చంద్రబాబును పవన్ కుప్పం సంఘటనపై పరామర్శించడానికి వెళ్ళిన నేపథ్యంలో చేసిన విమర్శలకు తిరుపతి జనసేన పార్టీ ఆధ్వర్యంలో తిరుపతి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి మంత్రుల దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి ఆకేపాటి సుభాషిణి మాట్లాడుతూ గతంలో వైజాగ్ ఘటనకు చంద్రబాబు పవన్‌ను పరామర్శించారని, కుప్పంలో జరిగిన ఘటనకు చంద్రబాబు సభలను అడ్డుకోవడంతోనే పవన్ చంద్రబాబును కలిసారన్నారు. చీకటి జీవోలను తీసుకొచ్చి ప్రతిపక్షాలను దెబ్బతీయడమే పనిగా అధికారపార్టీ పనిచేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వ తీరుతో ప్రజలు తీవ్రఅసహనంతో ఉన్నారని, రాబోయో ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. లక్ష్మి, ఆనంద్, విజయరెడ్డి, సుమన్ బాబు, మునుస్వామి, మనోజ్, రాజేష్ ఆచారి, బాటసారి, సుమన్, సాయిదేవ్, హేమంత్, బాలాజీ, పురుషోత్తం, రాజేష్, ఆదికేశవులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నిషన్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుపతి ల్యాబ్ టెక్నిషన్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆదివారం తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు అసోసియేషన్ గురించి, ల్యాబ్ టెక్నిషన్స్ వత్తి వైద్యరంగంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి సరైన గుర్తింపు లేదని వివరించామన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ల్యాబ్ టెక్నిషన్స్‌కు భరోసా ఇచ్చారు. అధ్యక్షులు వినయ్ కుమార్, గౌరవాధ్యక్షులు సురేంద్రన్, ప్రధాన కార్యదర్శి హరి, నితిన్, సభ్యులు థామస్, ప్రభు, హరి, నరేంద్ర, సుబ్బు, దాము, మనోహర్, సెల్వరాజ్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ రిజిస్ట్రార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని నూతన రిజిస్ట్రార్ గా నియమితులైన ఆచార్య ఎన్. రజిని ని గిరిజన జన సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మూడే మహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మూడే మహేంద్ర నాయక్ మాట్లాడుతూ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇటీవల జాతీయ స్థాయి నాక్ కమిటీ ఇచ్చే ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంలో మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున, మాజీ రిజిస్ట్రార్ డీఎం మమత, ఇతర ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కృషిని కొనియాడారు. నూతనంగా విశ్వవిద్యాలయాల కుల సజీవులు పదవి అలంకరించిన ఆచార్య ఎన్. రజిని వర్సిటీ అభివద్ధిలో మరింత కీలకపాత్ర వహించి జాతీయస్థాయిలో ఉన్నతంగా రాణించేందుకు కషి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయం ఇప్పటికే రాష్ట్రంలో బోధన, పరిశోధన రంగాల్లో ముందు ఉండటం ఎంతో గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో గిరిజన జన సమాజ్ సంఘం నేతలు అనిల్ కుమార్, పూజా, యురేకా, తదితరులు పాల్గొన్నారు.

నెలకు రూ.వెయ్యి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కోట: మండలంలోని గూడలి పంచాయతీలోని ప్రకాశం కాలనీకి చెందిన కటికాల నారాయణ అనే వ్యక్తి గత కొంతకాలంగా చర్మ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య గుర్తించారు. ఆయన కోరిక మేరకు నెల్లూరుకి చెందిన ఓరుగంటి ఫనేంద్రకుమార్ స్పందించి చర్మవ్యాధితో బాధపడుతున్న కటికాల నారాయణకు ప్రతినెలా రూ.వెయ్యి ఖర్చు నిమిత్తం అందజేస్తున్నట్లు శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్యకు తెలియజేశారు. ఆదివారం బాధితుడికి రూ.వెయ్యి అందించారు. కార్యక్రమంలో వేములూరు బాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకు రెక్టార్ పదవిని ఇవ్వండి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఖాళీ ఏర్పడిన రెక్టార్ పోస్టులు పూర్తిస్థాయిలో అర్హులైన బడుగు బలహీన వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆచార్యులకు సామాజిక వర్గాల నేపథ్యంలో నియమించాలని ఎస్సీ, ఎస్టీ, రీసెర్చ్ స్కాలర్స్, పీజీ స్టూడెంట్స్ సంఘం అధ్యక్షులు బి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం శ్రీ వేంకటేశ్వర విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సామాజిక వర్గాల నేపథ్యంలో బహుజనులకు చేయిస్తున్నారని, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెక్టార్ పదవిని ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని తెలిపారు.

కేకేసీలో ఉత్సాహంగా క్రీడాపోటీలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: యువతీ యువకులను ఉత్సాహ పరిచేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని కేకేసీ కళాశాల ఛైర్మన్ కె కుప్పయ్య శెట్టి పేర్కొన్నారు. పరమేశ్వర మంగళంలోని కేకేసీ హోమియోపతి కళాశాల విద్యార్థులకు ఆదివారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ నరసింహులు మాట్లాడుతూ ఏటా కళాశాలలో ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహిస్తామని.. గెలుపొందిన విద్యార్థులకు 11వ తేదీన బహుమతులు అందిస్తామని తెలిపారు.

గూడూరు ప్రజలందరికీ
సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -గూడూరు : గూడూరు నియోజకవర్గం లోని ప్రజలందరికీ గూడూరు శాసన సభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్‌రావు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం గూడూరులో సంక్రాంతి పండుగ ను పురస్కరించుకొని మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని వైసీపీ నాయకులు కోడూరు మీరారెడ్డి దంపతులు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం శుభ పరిణామమన్నారు. గూడూరు పాత బస్టాండ్ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం పూర్తయిందని.. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, టూ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, నాయకులు మీరా రెడ్డి, కల్పలత రెడ్డి, డాక్టర్ రోహిణి, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర్ల స్వామి ఆలయ ఛైర్మన్ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గూడూరు : గూడూరులోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం పుట్టా శంకరయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు జోగి శివకుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు మధు, గూడూరు పట్టణ కార్యదర్శి పామంజి మణి, మాజీ కోశాధికారి శేఖర్, మాజీ అధ్యక్షులు బండి క్రిష్టయ్య పాల్గొన్నారు.

యువతతోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఈనెల 12వ తేదీన జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహిస్తున్న యువశక్తి భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు గూడూరు డివిజన్ పరిధిలోని జనసేన నాయకులు కార్యకర్తలు యువత పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో యువశక్తి బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. మన యువత ద్వారా మన రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని, రాష్ట్రంలోని యువకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన యువశక్తి భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. వైసిపి పాలనలో ఇప్పటివరకు ఎటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయలేదని.. ప్రతి సంవత్సరం జనవరి నెలలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సంబంధించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీ ని నెరవేర్చలేదని విమర్శించారు . రాష్ట్రంలో చదువుకున్న యువత ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారన్నారు. పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఇంద్రవర్ధన్, నాగార్జున, విష్ణు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్, ఉపాధ్యక్షులు ఇమ్రాన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శులు విష్ణువర్ధన్, నాగార్జున, మండల కార్యదర్శులు మణికంఠ , అనీల్ , సంతోష్, క్రాంతి, శోభన్‌బాబు, నాగరాజు, కుట్టి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పనులు - కరకంబాడిలో దోపిడీ

ప్రజాశక్తి- రేణిగుంట: పేదలు కట్టుకున్న ఇళ్లను పంచాయతీ అధికారులు ఇతరులకు అప్పగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నప్పటికీ కనీసం అధికారులు స్పందించకపోవడం దారుణం. పేదలకు గతంలో ఇచ్చిన స్థలాలను అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో పంచాయతీ అధికారులు అమ్మేస్తున్నారు. రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయతీలో దోపిడీ జరుగుతోంది. ఇక్కడ అధికార పార్టీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలకు అటు మండల అధికారులు.. ఇటు పంచాయతీ అధికారులు పూర్తిగా తమ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రజలకు పనిచేయాల్సిన అధికారులు కేవలం స్థానిక ప్రజాప్రతినిధుల మెప్పుకోసం పని చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వందల సంఖ్యలో ప్లాట్లను అమ్మేస్తూ లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు. ఇక్కడ స్థలాలు పొందిన పేదలకు పట్టా ఉన్నప్పటికీ స్థలాలు కనిపించడం లేదు. పేదలకు ఇచ్చిన వాటిని పంచాయతీ అధికారులు అధికార పార్టీ నాయకులకు తాకట్టు పెట్టేశారు. దీంతో నాయకులు స్థలాలను తమకు ఇష్టమైన ధరకు అమ్మేస్తున్నారు. సమస్య ఉన్న ఇళ్ల స్థలాల్లో చేయి తడిపిన వారికి మాత్రమే విద్యుత్ మీటర్లకు ఎన్వోసీలు ఇవ్వడంతో పలువురు ఘర్షణకు దిగుతున్నారు. ఇదెక్కడి న్యాయమని పేదలు వెళ్లి పంచాయతీ అధికారులను ప్రశ్నించగా వారు ఇచ్చే సమాధానం మరీ ఘోరం. అసలు ఈ పట్టా నీదేనా..నువ్వు ఇక్కడే ఉన్నావా... నీ తల్లిదండ్రుల పేరు ఇదేనా... నీకు ఎందుకు పట్టా ఇచ్చారు.. ఎందుకు ఇవ్వాలి అని విచిత్రమైన ప్రశ్నలు వేస్తున్నారు. దీనిపై సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కరకంబాడికే ఒక నాయకుడిని స్థానిక ప్రజాప్రతినిధి నియమించాడు. దీంతో ఏ పనైనా ఆయనే నుంచే జరగాలని ఆ నాయకుడు స్థానికులకు హుకుం జారీ చేశాడు. తన అనుమతి లేకుండా ఇక్కడ పని చేయరాదని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా పంచాయతీ రికార్డులను మండల అధికారులు సైతం తీసుకొని తమ కార్యాలయంలో పెట్టుకొని వ్యాపారాలు చేసుకుని అమ్మకాలు చేసినట్లు ఆరోపించారు. అయితే పంచాయతీ అధికారి మాత్రం తనకి ఇవ్వాల్సింది ఇస్తేనే పన్ను కాయితాలు ఇస్తానని తెగేసి చెప్పడం ఇక్కడ వివాదాస్పదమైంది.

రాజుగుంటలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రాజుగుంట గ్రామంలో ఆదివారం టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు 'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా, సురక్షితంగా ఉండేవారని తెలిపారు. అలాగే సామాన్య, పేద ప్రజలు నిత్యావసర సరుకులు పెరిగిన రేట్లతో బతకాలో, చావాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంటలు పండించే రైతులకు యూరియా సక్రమంగా అందించలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రతి ఇంటికీ తిరిగి ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి రమేష్, సుబ్రహ్మణ్యంనాయుడు, నాగేశ్వర్ రెడ్డి, రఘు నాయుడు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

ప్రజాశక్తి- వి.కోట: మండల పరిధిలోని కొంగాటం గ్రామ పంచాయతీలో మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి నేతత్వంలో 'ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కొంగాటం చేరుకున్న మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రం రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటూ రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తోందని ఎద్దేవా చేశారు. సంపూర్ణ మద్య నిషేధం చేస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి రాగానే నాసిరకం బ్రాండ్లతో సామాన్యుల ప్రాణాలను బలిగొంటున్నారని ఆరోపించారు. కుప్పంలో చంద్రబాబు రాకుండా పోలీసుల ద్వారా అడ్డుకోవడం ఈ ప్రభుత్వ దుష్ట పాలనకు నిదర్శనం అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వం కూలిపోయే రోజులు దగ్గరలో ఉందన్నారు. టీడీపీ హయంలో చేపట్టిన అభివద్ధి తప్ప గడచిన మూడున్నరేళ్లలో చేసిన అభివద్ధి కార్యక్రమాలు ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ ప్రజలతో మమేకమౌతూ పెరిగిన ధరలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేస్తూ ముందుకు కదలారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏఎం రంగనాథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, రాంబాబు నాయుడు, ఈశ్వర్‌గౌడ్, సోము చంద్రారెడ్డి, విశ్వనాథ్, ధీరజ్‌తో పాటు పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి-పలమనేరు: చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రాజకీయ పార్టీలను బీసీ నాయకులు రవి , కుప్పం మునిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పలమనేరులోని వన్నెకుల క్షత్రియ భవన నిర్మాణం వద్ద బీసీ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మునిరాజు మాట్లాడుతూ జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వన్నెకుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు , వెంకటాచలం, వాణిజ్య విభాగం కల్పన నారాయణస్వామి, ఉద్యోగ విభాగం గణేష్, రామచంద్ర, శాలివాహన సంఘం అధ్యక్షుడు రామకష్ణ , యువజన సంఘం బాలసుబ్రమణ్యం, మహిళ సంఘం అధ్యక్షురాలు కాంతమ్మ , మేదర సంఘం వెంకటరమణ, శివ, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా కళాతరంగిణి సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అదివారం కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు బాలికలు , మహిళలు ఈ ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. ఇందులో ఆకర్షణీయంగా ముగ్గులు వేసిన వారికి బైరెడ్డిపల్లె ఎంఈఓ సాయిలీల ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈ ఓ మాట్లాడుతూ మన సంస్కృతి , సాంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రతి యేటా కళాతరంగిణి సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కళాతరంగిణి చిన్నారులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం ప్రకాష్ , సి ఆర్ పి రామచంద్ర, రిటైర్డ్ టీచర్ చంద్రశేఖరగుప్త, కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్ బాబు , కో ఆర్డినేటర్ సురేష్ బాబు , ఉపాధ్యాయులు రాంమోహన్, విమల, సురేఖ, చైతన్య , సీనియర్ ఆర్టిస్టులు మస్తాన్ వలి, రాజన్న, ఇస్మాయిల్, నియాజ్, గంగరాజు, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-సోమల: సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం1981-82 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమ్మేళనమై గురువులకు సత్కారం చేశారు. తమ వద్ద చదివిన విద్యార్థులు గురువులను మరిచిపోకుండా గుర్తుపెట్టుకుని తమను సన్మానం చేయడం విద్యార్థుల మంచితనానికి నిదర్శనమని సన్మాన గ్రహీతలు అన్నారు. ఉన్నత పాఠశాలలో మంత్రి పెద్దిరెడ్డి, తంబళ్లపల్లె శాసనసభ్యులు ద్వారకనాథ్ రెడ్డి తదితరులు చదివి ఉన్నత స్థానాలకు చేరడం పాఠశాలకే గర్వకారణమన్నారు. పాఠశాల అభివద్ధి కోసం రూ.కోట్ల నిధులను మంత్రి మంజూరు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సదుం ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దడం మండలానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గురువులు మునస్వామినాయుడు, కష్ణారెడ్డి, రాజారెడ్డి, రామచంద్రారెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఎస్‌బీఆర్‌పురంలో వీధిదీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండల పరిధిలోని శ్రీబొమ్మరాజపురం గ్రామ పంచాయతీలో బస్టాండ్, ముత్తరాశిపాలెం ఎస్టీ కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఆదిఆంధ్ర వాడలో సర్పంచ్ మణిరాజు శనివారం, ఆదివారం రెండు రోజులుగా వీధిదీపాలను ఏర్పాటు చేయించారు. సంక్రాంతి సందర్భంగా ఎలాంటి ఆటంకాలు రాకూడదని గ్రామంలో పాడైన విద్యుత్ దీపాలను తీసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామస్థులు సర్పంచ్ మణిరాజుకు కృతజ్ఞులు తెలిపారు.

బ్రాహ్మణులకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-రేణిగుంట: బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బ్రాహ్మణులకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. తిరుపతి బ్రాహ్మణ కో ఆరేటివ్ క్రెడిట్ సొసైటీ బాడీ మెంబర్ శేషగిరిరావు, మాజీ మెంబర్ చిత్రపు హనుమంతరావు, స్వాతి, డాక్టర్ రమేష్, రేణిగుంట బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రామ్‌మోహన్, ఉపాధ్యక్షుడు రెడ్డి, ప్రకాష్, కార్యదర్శి వెన్నెలకంటి కష్ణమూర్తి, సహాయ కార్యదర్శి పంకజమ్మ, ట్రెజర్ శివకుమార్, ఎక్జిక్యూటివ్ మెంబర్లు, అశోక్, ఉమాదేవి, రాజ్యలక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.

రేణిగుంటలో ఫుట్‌బాల్ ....

ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణంలోని బాలుర పాఠశాలలో ఆదివారం ఆర్గనైజర్ ప్రభు ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. తిరుపతి డైనమోస్ జట్టు విజయం సాధించింది. వారికి రేణిగుంట వైసీపీ ఇన్‌ఛార్జి పవిత్రరెడ్డి చేతుల మీదుగా కప్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు క్రీడలతోనే మానసికోల్లాసమని.. యువత క్రీడలను అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం రన్నర్స్ గా నిలిచిన రేణిగుంట లయన్స్ జట్టుకు కప్ అందించారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నగేష్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, పట్టణ అధ్యక్షులు ప్రభాకర్, కో ఆప్షన్ మెంబర్ సుభానరాజ, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని గాంధీబొమ్మ వద్దఉన్న సిద్ధు అలర్జీ, ఊపిరితిత్తుల హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిప్రసాద్ నేతృత్వంలో రోడ్డుపక్కన, రైల్వే స్టేషన్, ఆలయాల వద్ద బిక్షాటన చేస్తున్న నిరుపేదలకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. పేద ప్రజలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలలో గత 20 సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరాలు.. సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వహిస్తూ రోగులకు ఉచితంగా మందులు అందిస్తున్నామని తెలిపారు.

నేదురుమల్లిని కలిసిన బీఎన్‌కండ్రిగ నాయకులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని వైసీపీ నాయకులు ఆదివారం ఉదయం తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కుమారుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని బీఎన్‌కండ్రిగ నాయకులు కలిశారు. మాజీ మండల కన్వీనర్ చిట్టిబోయిన గోపియాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వెంకటగిరిలో రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తలారివెట్టు గ్రామ సర్పంచ్ వెట్టిప్రసాద్, కళ్లివెట్టు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుప్పయ్య, కుక్కంబాకం సర్పంచ్ గంగయ్య, కళ్లివెట్టు మాజీ సర్పంచ్ వెంకటేష్ తదితరులు కలిశారు.

ప్రత్యేక ఫిర్యాదుల దినం
సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కోట: కోట తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భూ సమస్యలపై స్పెషల్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. రోడ్డు వెడల్పు చేసే కార్యక్రమంలో భాగంగా ఆక్రమణలు తొలగించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఈ అవకాశాన్ని కోట మండలంలోని అన్ని పార్టీ నాయకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోట మండలంలో భూ సమస్యలు ఉంటే అర్జీలు ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉషోదయ ఫౌండేషన్ నిర్వాహకురాలు, టిడిపి మహిళా విభాగం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షురాలు చక్రాల ఉష ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మ్యూజిక్ ఛైర్స్ తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉరుకుల పరుగుల జీవితంలో కొంత సమయాన్ని ఆటలకు కేటాయించడం వల్ల శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని ఉష అన్నారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండల కేంద్రంలో హైస్కూల్ గ్రౌండ్‌లో చవటగుంట యువత ఆధ్వర్యంలో సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ మోహన మురళి ఆదివారం ప్రారంభించారు. చైతన్య కన్స్ట్రక్షన్స్ అధినేత చైతన్య కుమార్ రెడ్డి, కిరణ్ యాదవ్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, భాస్కర్, తులసి, నవీన్, ప్రవీణ్, జయ, భారత్, దయానందం, తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

పోలీసు స్టేషన్ ఎదుటే దాడులు

ప్రజాశక్తి-వరదయ్యపాళెం: మండలంలోని అక్షింపాళెం గ్రామంలో గతకొన్ని నెలలుగా రవి, వంశీల మధ్య స్థల వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం వంశీ తన ఇంటి స్థలంలో మట్టి చదును చేస్తున్న సమయంలో రవి, తేజ, రమణ మరికొందరు శివాజీపై దాడికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఓ వర్గాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అదుపుచేసే ప్రయత్నంలో పోలీసులు ఉండగానే...రవి, తేజ వారి వర్గం అవతలి వారిపై పోలీస్టేషన్ లోపలికి దూరి దాడి చేసి గాయపరిచినట్లు బాధితులు తెలిపారు. ఇక్కడ జరిగిన దాడిలో ఓ వర్గానికి చెందిన వారికి రక్తగాయాలు కావడంతో సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవర్గం వారికి గాయాలయ్యాయి.

చోరీ కేసులో నలుగురు నిందితులకు రిమాండు

ప్రజాశక్తి-వరదయ్యపాళెం: విద్యుత్తు తీగల చోరీకి పాల్పడుతున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.20 వేలు విలువైన అల్యూమినియం తీగలు, ఆటో, బైక్‌లను సీజ్ చేసినట్లు వరదయ్యపాళెం ఎస్ఐ నాగార్జున్ రెడ్డి వెల్లడించారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని నెల్లటూరు, గూడలవారిపాళెం గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ స్థంభాల నుంచి విద్యుత్తు తీగలను చోరీ చేస్తుండటంతో విద్యుత్‌శాఖ ఏఈ శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరుగుతున్న ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టగా ఓ ఆటోలో విద్యుత్ అల్యూమినియం వైరు తరలిస్తుండటాన్ని గుర్తించామని, ఆటో వెంబడించిన బైక్‌ను గమనించి వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. బీఎన్ కండ్రిగకు చెందిన చెంగయ్య, మాంబట్టు కు చెందిన గోపి, మత్తయ్యలు కలిసి చోరీ చేసిన విద్యుత్ వైర్లను శ్రీకాళహస్తికి చెందిన ముబారక్ అనే వ్యాపారస్తుడికి విక్రయిస్తున్నట్లు తెలిసింది. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-సోమల: సోమల బస్టాండులో వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఢీకొనడంతో ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాల పాలైన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. సదుం వైపు నుంచి వేగంగా వచ్చిన కారు సొంత పనుల నిమిత్తం బస్టాండు కూడలికి వచ్చిన కో ఆప్షన్ మెంబర్ మస్తాన్ సాహెబ్ ను ఢీకొనడంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సమీపంలోని వ్యక్తులు గాయపడిన మస్తాన్ సాహెబ్ ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 లో తరలించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలోని పాతగుంట ఉన్నత పాఠశాలలో ఆర్‌వీఎస్ హాస్పిటల్ చిత్తూరు వారి సహాయంతో ధన్వంతరి హెల్త్ అండ్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 130 మంది రోగులకు వైద్యం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కిషోర్, డాక్టర్ గోవర్ధన్, హాస్పిటల్ సిబ్బంది ధన్వంతరి, అధ్యక్షులు రామచంద్ర, భూపతి, సంస్థ సభ్యులు మోహన్, బాబు, జ్యోతీష్‌కుమార్, చందు, జ్యోతీశ్వర్, లత, ఉష పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-వి.కోట: మండల కేంద్రమైన వి కోటలోని బాలికల వసతి గహ సంక్షేమ అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల వసతి గహంలో విద్యార్థినులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వందమంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ఉత్తమంగా ముగ్గులు వేసిన 29 మంది బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వసతి గహ సిబ్బంది రేణుక, సులోచన, షాలిని, మౌనిక పాల్గొన్నారు.

రోడ్డుపై ఆగిన గ్రానైట్ లారీ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం చవటకుంట పచ్చికాపల్లం రహదారి మధ్యలో ఆదివారం ఓ గ్రానైట్ తరలిస్తున్న లారీ మొరాయించడంతో రోడ్డు పక్కన ఆగిపోయింది. వెదురుకుప్పం మండలం మీదుగా ప్రతి ఆదివారం నాలుగైదు భారీ వాహనాల్లో గ్రానైట్ ను తరలిస్తున్నారు. గతంలో పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట కనుమ వద్ద ఓ గ్రానైట్ లారీ అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ వ్యక్తి చనిపోయాడు. ఈ సంఘటన ఇంకా మరిచిపోక ముందే గ్రానైట్ వ్యాపారులు కనీస భద్రత కూడా లేకుండా లారీల ద్వారా గ్రానైట్ దిమ్మెలను తరలించడం ఎంతవరకు సబబు అని పోలీసులపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు.